క్లుప్తంగా

స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ



స్పోర్ట్స్ దుస్తులు అందుకున్న క్రీడాకారులు

బేతంచెర్ల: పట్టణంలోని 10 మంది క్రికెట్ క్రీడాకారులకు పారిశ్రామికవేత్త నారాయణస్వామి ఆదివారం స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు చదువుతో పాటు క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు విజయుడు, శేక్షావలి చౌదరి, ఉన్నం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

‘ఆ నలుగురు’ సేవలు అభినందనీయం



స్వచ్ఛంద సంస్థ సభ్యులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ రాజారెడ్డి

బనగానపల్లె/బేతంచెర్ల: అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బనగానపల్లెలో ఆదివారం ఆ సంస్థ అధ్యక్షుడు వన్నూర్‌బాషా, సంస్థ సభ్యులను సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. స్వచ్ఛంద సంస్థకు తన వంతుగా రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు పెద్దమ్మ ఆలయ ఆవరణలో ఉన్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి గోస్పాడు మండలం తేల్లపూరి గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, సావిత్రి, నిర్మల, వరలక్ష్మీ కుటుంబ సభ్యులు రూ.50 వేల విరాళాన్ని సంస్థ నిర్వాహకుడు రామగంగిరెడ్డికి ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సరోజిని నాయుడుకు నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రీ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సరోజిని నాయుడు తొలి మహిళా గవర్నర్‌గా పనిచేశారని తెలిపారు. తన రచనలతో ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ప్రతి మహిళా ధైర్యంగా దేశానికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేంద్రప్ప, భానుప్రకాష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన బనగానపల్లె తాలూకా నూతన కార్యవర్గం

బనగానపల్లె రూరల్: స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల బనగానపల్లె తాలూకా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమీర్ అలీ, ఉపాధ్యక్షులుగా డి.అబ్దుల్‌హక్, ఎస్.ప్రసాద్, కార్యదర్శిగా మురళీ కృష్ణుడు, సంయుక్త కార్యదర్శులుగా కేఎండీ షఖీల్, డి.హేమలత, కోశాధికారి పి.ఇబ్రహీం, సభ్యులుగా మక్బుల్ హుస్సేన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందు, జిల్లా కోశాధికారి షరీఫ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటిస్వామి సేవలో మాజీ ఎమ్మెల్యే

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి వారిని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ పండితుడు జ్వాలా చక్రవర్తి, అర్చకుడు మనోహర్ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మదనంతపురంలో తాగునీటి సమస్య



నీటిని తెచ్చుకోవడానికి బిందెలు తీసుకెళ్తున్న మహిళలు

కొలిమిగుండ్ల: వేసవి ప్రారంభం కావడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయి. మదనంతపురంలో వారం నుంచి గ్రామస్తులను తాగునీటి సమస్య వేధిస్తోంది. ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి కొళాయిలకు నీటి సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం మధ్యలో ఉన్న మినీ వాటర్ ట్యాంక్‌ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. త్రీఫేజ్ విద్యుత్ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఉండడంతో మినీ ట్యాంక్‌లకు నీటి సమస్య ఏర్పడుతోంది. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో సమస్య జటిలంగా మారుతోంది. కొందరు బైక్‌లలో వ్యవసాయ బోర్ల వద్ద అరకొరగా వస్తున్న నీటిని తెచ్చుకుంటున్నారు. వేసవి ఆరంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో నీటి సమస్య మరింత తీవ్రతరం అవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కమ్యూనిటీ హాలు లేక అవస్థలు



కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కేటాయించిన స్థలం

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామంలో కమ్యూనిటీ హాలు లేక అవస్థలు పడుతున్నట్లు ఎస్సీ కాలనీ వాసులు వాపోతున్నారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 20 ఏళ్ల క్రితం స్థలాన్ని కేటాయించారు. ఎస్సీ కాలనీలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. శుభకార్యాలు చేసుకునేందుకు కమ్యూనిటీ హాలు నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఆగిన పనులు.. దూరమైన సేవలు



మునిమడుగులో ఆగిపోయిన సచివాలయ నిర్మాణ పనులు

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామ స్వరాజ్యం సాకారమైంది. గ్రామాల్లో సచివాలయాల నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చింది. అయితే కొన్ని గ్రామాల్లో సచివాలయ భవనాలు, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణ దశలో ఉండగా ఎన్నికల కోడ్ వచ్చి ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. మండల పరిధిలోని మునిమడుగు గ్రామంలో సచివాలయం, విలేజ్ క్లినిక్ పనులు నిలిచిపోవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాల్సిన బాధ్యతను కూటమి ప్రభుత్వం విస్మరించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జాడలేని ఆహార సలహా సంఘాలు

- జరగని సమావేశాలు
- పట్టించుకోని పౌరసరఫరాల అధికారులు
- రేషన్‌షాపులపై కొరవడిన నియంత్రణ
- పెరుగుతున్న మోసాలు



డోన్ తహసీల్దార్ కార్యాలయం

డోన్ రూరల్: చౌక దుకాణల్లో నిత్యావసర సరుకుల అక్రమాలకు చెక్‌పెట్టి, కార్డుదారులకు సజావుగా అందేలా చూడాల్సిన బాధ్యత ఆహార సలహా సంఘాలపై ఉంది. మూడు నెలలకోసారి ఆహార సలహా సంఘం ఆధ్వర్యంలో రేషన్ సరుకులపై సమీక్షించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే డోన్ నియోజకవర్గంలో ఎక్కడా సంఘాల సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. డోన్ నియోజకవర్గంలో డోన్, ప్యాపిలి, బేంతచెర్ల మండలాలు ఉన్నాయి. మొత్తం 236 చౌకదుకాణాలు, 79,338 పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ దుకాణాల్లో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసింది. సంఘం చైర్మన్‌గా సబ్ కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా తహసీల్దార్, సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు, హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు ఉంటారు. ఆహార సలహా కమిటీకి రేషన్ షాపుల తనిఖీలు, బియ్యం సరఫరాపై నిఘా, తూనికలు–కొలతలపై పర్యవేక్షణ అధికారాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేకపోవడంతో రేషన్ డీలర్లది ఇష్టారాజ్యమైంది. చౌక దుకాణాల్లో ఇచ్చే సరకుల నాణ్యతను పట్టించుకునే వారు కరువయ్యారు. రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో చోటు చేసుకుంటున్న సమస్యలపై పలుమార్లు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు. షాపుల్లో సకాలంలో సరకులు పంపిణీ చేయడం లేదని, కొలతల్లో తేడాలు ఉంటున్నాయని, ఆన్‌లైన్ సక్రమంగా పనిచేయడం లేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే సరుకులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలను నిలిపివేసి తమ ఇష్టమొచ్చినట్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. వికలాంగులు, వృద్ధులు, రేషన్ దుకాణాలకు వెళ్లి క్యూలో నిల్చుని అవస్థలు పడి సరుకులు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి సమావేశాలను నిర్వహించాలని పులవురు కోరుతున్నారు.

లోపించిన పర్యవేక్షణ



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాలు చేసి సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాపుల్లో చోటు చేసుకుంటున్న లోటుపాట్లు గురించి సమావేశాల్లో అధికారుల దృష్టికి సంఘం సభ్యులు తీసుకొచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఘాలు పనిచేస్తున్నాయా లేదా కూడా తెలియడం లేదు. అధికారులు పట్టించుకోవడంలేదు. డీలర్ల సమావేశంలో మమ అనిపిస్తున్నారు.

–ఓబులేష్, ఎంపీటీసీ సభ్యుడు, లక్ష్మంపల్లి

చర్యలు తీసుకుంటాం



డోన్ మండలంలో ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రేషన్ సరుకుల పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే సమాచారమిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తా. త్వరలోనేద్మార సలహా సంఘం ఏర్పాటు చేసి, సమావేశం నిర్వహిస్తాం. రేషన్ పంపిణీలో సమస్యలను గురించి చర్చిస్తాం.

–కె.నాగమణి, తహసీల్దార్, డోన్

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, కలుగొట్ల, అల్లూరు, కొత్తపల్లె గ్రామాలకు సంబంధించి ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, రేవనూరు, లింగాల, గుండుపాపల గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ మధుసూదన్ యాదవ్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ ప్రమాదంలో జొన్న చొప్ప దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న పాడి రైతులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో ఆదివారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో జొన్నచొప్ప దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన ప్రసాదరెడ్డి పొలం నుంచి చొప్పను ట్రాక్టర్‌లో వేసుకుని ఇంటికి వస్తుండగా గ్రామంలోని శివాలయం వద్ద కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. ప్రమాదం గుర్తించిన ట్రాక్టర్ డ్రైవర్ ట్రాలీ లిఫ్ట్ ఎత్తి చొప్ప బోపును కిందకు తోశాడు. చొప్ప పూర్తిగా దగ్ధం కావడమే కాకుండా పక్కనే కల్లాల్లో ఉన్న గడ్డివాములపై నిప్పు రవ్వలు పడ్డాయి. గడ్డివాముల్లో మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన పాడి రైతులు మంటలు ఆర్పారు. బనగానపల్లె ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేశారు. శివాలయంలో వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఇదే ప్రాంతంలో మూడు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయని ఆందోళన చెందుతున్నారు.

ఆలయ గోపురం నుంచి పడి వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

బనగానపల్లె రూరల్: యాగంటి ఆలయ గోపురంపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగిస్తుండగా ప్రమాదశాత్తు కిందపడి నరేంద్ర అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. మహాశివరాత్రి సందర్భంగా ఆలయ గోపురానికి విద్యుత్ లైట్లు వేశారు. ఆదివారం సాయంత్రం అవి తీసేందుకు చాగలమర్రి మండలం బోధనం గ్రామానికి చెందిన నరేంద్ర గోపురంపైకి ఎక్కి వైర్లను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడ్డాడు. ఆలయ సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాలు, తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు వైద్యులు సిఫార్సు చేశారు.

17 గొర్రెలు మృత్యువాత



మృతి చెందిన జీవాలు

ప్యాపిలి: మండల పరిధిలోని బూరుగల గ్రామంలో విషపూరిత మొక్కలు తిని 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన వెంకటేశ్ తన జీవాలను ఆదివారం మేతకోసం అడవికి తీసుకెళ్లాడు. అడవిలో విషపూరిత మొక్కలను తిన్న దాదాపు 150 జీవాలు అస్వస్థతకు గురయ్యాయి. వీటిలో 17 గొర్రెలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న రాచర్ల పశువైద్యాధికారి హుసేన్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్స అందించగా అవి కోలుకుంటున్నాయి. మృతి చెందిన జీవాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ప్రభుత్వం తనకు ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



బండను లాగుతున్న ఎద్దులు

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు 22 ఎద్దుల జతలు పాల్గొన్నాయి. పోటీలను టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ ప్రారంభించారు. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.1.50 లక్షలు, రూ.1.30 లక్షలు, రూ.1.10 లక్షలు, రూ.90 వేలు, రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

కొలిమిగుండ్ల: ముస్లింల పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ఆదివారం నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు ప్రారంభించారు. కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినపేట, కనకాద్రిపల్లె, పెట్నికోట, తుమ్మలపెంట, బందార్లపల్లె తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్ష చేయడంతో పాటు ప్రతి రోజు ప్రార్థనలు చేయనున్నారు.

ఆటో డ్రైవర్లపై కేసు నమోదు

బనగానపల్లె: నందివర్గంలో అతివేగంగా వెళ్తున్న ఇద్దరు ఆటో డ్రైవర్లపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దాయడి మోహన్, ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చాకలి పరశురాముడు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని అతి వేగం.. నిర్లక్ష్యంగా నడుపుతుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

5న రైతు సంఘం ధర్నా



కరపత్రాలు విడుదల చేస్తున్న సంఘం నాయకులు

బేతంచెర్ల: రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 5వ తేదీ నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో రైతులతో సమావేశం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతు సంఘం నాయకుడు కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందుకుంటున్న బాలింతలు

డోన్: పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులు, రోగులు, బాలింతలకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ జరిగింది. వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన రెవెన్యూ అధికారి దైవాదీనం ప్రేమకుమారి ఆర్థిక సాయంతో రొట్టె, గుడ్లు, పప్పు, అరటిపండులను పంపిణీ చేసినట్లు ప్రార్థన సమయం సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ తెలిపారు.

7 నుంచి కాశీ విశ్వనాథస్వామి ప్రతిష్ఠోత్సవాలు



నూతనంగా నిర్మించిన కాశీవిశ్వనాథస్వామి గాలిగోపురం

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీసెంటర్‌లో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమం జనవరి 31వ తేదీ జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. అర్చకుల సూచనల మేరకు ఈ నెలలో ఉత్సవాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయంలో మొదటి రోజు గంగాయనం, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, పంచగవ్యమేళన, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, 8వ తేదీ రుద్రాభిషేకం, మహాస్నపనం, గణపతి, నవగ్రహ, రుద్ర, దేవి పంచసూక్త లక్ష్మీనారాయణ, సుదర్శన, తదితర హోమాలు జరుగుతాయన్నారు. 9వ తేదీ యంత్ర ప్రతిష్ఠ, ధ్వజ, శిఖరకలశ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. చివరి రోజున ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.



కూరగాయల సంతలో నిలిచిపోయిన వాహనాలు

సంతతో ట్రాఫిక్ కష్టాలు

సంజామల: మండల కేంద్రం సంజామలలో ప్రతి ఆదివారం కూరగాయల సంత జరుగుతుంది. సంజామలకు చుట్టుపక్కల ఐదు గ్రామాల నుంచి కూరగాయల సంతకు ప్రజలు వస్తుంటారు. ప్రధాన రహదారిలోని బస్టాండ్ ప్రాంతంలో సంత నిర్వహిస్తుండడంతో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, కొనుగోలుదారులతో కిక్కిరిపోతుంటుంది. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దారి లేక భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు చాలా సమయం రోడ్డుపైనే నిలిచిపోయే పరిస్థితి. అధికారులు స్పందించి కూరగాయల సంత రోజు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



ముదిగేడులో మరమ్మతులు చేస్తున్న కార్మికులు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో లీకేజీ అవుతున్న తాగునీటి పైప్‌లైన్‌కు ఆదివారం మరమ్మతులు చేశారు. ప్రధాన రహదారిలో భారీ వాహనాల రాకపోకలతో తాగునీటి పైప్‌లైన్ నాలుగు రోజుల క్రితం పగిలిపోయింది. సమస్యను అధికారులు పట్టించుకోకపోవడంతో ‘పారుతున్న నిర్లక్ష్యం’ అనే శీర్షికతో ఆదివారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.